క్లుప్తంగా

అప్పన్న సన్నిధిలో కేరళ ప్రిన్సిపల్ సెక్రటరీ



కప్పస్తంభం వద్ద డాక్టర్ అశోక్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం కేరళ వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ బి.అశోక్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తరపూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం, ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఆలయ సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ప్రసాద్ అందించారు.

పీజీఆర్‌ఎస్‌కు 11 వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ హైమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్‌ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 11 వినతులు అందాయి. ఆక్రమణలు, స్థానిక సమస్యలపైనే అర్జీలు వచ్చాయి. గతంలో ఇచ్చిన ఓ అర్జీ పరిష్కారానికి నోచుకోకపోవడంతో మళ్లీ జెడ్సీని ఆశ్రయించారు. ఆయా వినతులను స్వీకరించిన జెడ్సీ హైమావతి సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు జెడ్సీ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జోన్–8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బోటనీ సబ్జెక్టును ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు ఎమ్మెస్సీలో సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై, నెట్/సెట్ కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో డెమో క్లాసు ఇచ్చేందుకు బుధవారం(20వ తేదీ) ఉదయం 10 గంటలకు కళాశాలకు హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం: సాధారణ నిర్వహణ పనుల్లో భాగంగా మంగళవారం విద్యుత్ సరఫరాకి అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. అడవివరంలోని గోశాల లేఅవుట్, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, టీవీ టవర్ కాలనీ, ప్రియాగా రైస్స్, ధారపాలెం, సింహాచలం తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

బాక్సింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



ధీరజ్‌యాదవ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శివకుమార్, సిబ్బంది

పెందుర్తి: ఆంధ్ర యూనివర్సిటీలో ఇటీవల ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ బాక్సింగ్ పోటీల్లో పెందుర్తి మండలం పినగాడిలోని విస్టం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి బి.ధీరజ్ యాదవ్ రజత పతకం సాధించాడు. సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విజేత ధీరజ్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శివకుమార్, హెచ్‌వోడీ నోయల్, ఫిజికల్ డైరెక్టర్ బి.రమణారావు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

సబ్బవరం: ఏయూలో నిర్వహించిన అంతర కళాశాలల బాక్సింగ్ పోటీల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి జస్వంత్ మూడో స్థానంలో నిలిచి, ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి తెలిపారు. కంప్యూటర్ సైన్స్ ఫస్టియర్ చదువుతున్న కండిపల్లి జస్వంత్ ఈ నెల 15న జరిగిన పోటీల్లో 57 కిలోల విభాగంలో ప్రతిభ కనబరిచారన్నారు. లింగాలతిరుగుడు గ్రామానికి చెందిన తన తండ్రి కండిపల్లి కనకరాజు స్వతహాగా బాక్సర్ కావడంతో చిన్నప్పటి నుంచి బాక్సింగ్‌పై ఆసక్తితో నేర్చుకుని ఈ స్థాయిలో రాణించాడన్నారు. ఈ సందర్భంగా జస్వంత్‌ను కళాశాల అధ్యాపకులు డాక్టర్ కృష్ణ, కె.ప్రభుదాస్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ గణేష్ తదితరులు అభినందించారు.

నియోజకవర్గంలో కుక్కల బెడద పెరుగుతోంది. పట్టణం, గ్రామీణం అనే తేడా లేకుండా ప్రతి వీధిలో శునకాలు అలజడి రేపుతున్నాయి. రోడ్లపై గుంపులుగా ఏర్పడి కనిపించిన వారందరినీ వెంబడిస్తున్నాయి. దొరికిన వారిని తీవ్రంగా గాయపరుస్తున్నాయి. దీంతో ఒంటరిగా వీధుల్లోకి వెళ్లాలంటే భయపడే పరిస్థితి. చిన్నారులు, వృద్ధులు, మహిళల పరిస్థితి మరీ దారుణం. రోజూ పదుల సంఖ్యలో కుక్కకాటు బాధితులు ఆస్పత్రుల్ని ఆశ్రయిస్తున్నారు.

కుక్కలు భౌబోయ్!



పెందుర్తి, దొగ్గవానిపాలెం ప్రాంతాల్లో తిరుగుతున్న వీధి కుక్కలు

- పెందుర్తి ప్రాంతంలో పెరుగుతున్న వీధి కుక్కలు
- పీహెచ్‌సీకి రోజుకు 20–30 మంది కుక్కకాటు బాధితులు
- **చిన్నపిల్లలు, మహిళలపై ఎక్కువగా దాడి**
- **నియంత్రణ చర్యల్లో అధికారులు విఫలం**

పెందుర్తి:

గ్రామాలు, కాలనీలనే తేడా లేకుండా కుక్కల బెడద విపరీతంగా పెరిగిపోయింది. వీధుల్లో విచ్చలవిడిగా తిరుగుతూ మనుషుల వెంట పరుగెత్తి మరీ దాడి చేస్తున్నాయి. కుక్కల దాడుల నేపథ్యంలో పిల్లలను ఒంటరికి బయటకు పంపేందుకు తల్లిదండ్రులు జంకుతున్నారు. పాఠశాలకు, ట్యూషన్ల కోసం దగ్గరుండి మరీ తమ పిల్లల్ని దిగబెట్టి వస్తున్నారు. కుక్కల నియంత్రణ విషయంలో అధికారుల నిర్లక్ష్యంతో కుక్కకాటు బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. నియోజకవర్గం పరిధిలోని ఆస్పత్రులకు నిత్యం 20–30 మంది కుక్కకాటు బాధితులు వస్తుండడం పరిస్థితి తీవ్రతను వెల్లడిస్తోంది. ఒక్క పెందుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రంలోనే నెల రోజుల వ్యవధిలో 200 వరకు కేసులు నమోదయ్యాయి.


పెరుగుతున్న వీధి కుక్కలు

పెందుర్తి ప్రాంతంలో ముఖ్యంగా జీవీఎంసీ విలీన ప్రాంతాల్లో రోజురోజుకు శునక రాజ్యం విస్తరిస్తోంది. దాదాపు ప్రతి కాలనీలోనూ పదుల సంఖ్యలో కుక్కలు తిష్ట వేస్తున్నాయి. ఇతర ప్రాంతాల్లో పట్టుకున్న కుక్కలను ఇక్కడ వదిలిపెట్టడంతో వీటి సంఖ్య మరింత పెరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నగరంలో పట్టుకున్న కుక్కలను జీవీఎంసీ సిబ్బంది పెందుర్తి ప్రాంతంలో విడిచిపెడుతున్నారు. ఇవి పగలూ రాత్రి తేడా లేకుండా ప్రజలపై దాడులకు దిగుతున్నాయి. ముఖ్యంగా పారిశుధ్య కార్మికులు, విద్యార్థులు ఉదయం పూట కుక్కకాటుకు ఎక్కువగా గురవుతున్నారు. సాయంత్రం వేళల్లో వాకర్స్, మహిళలపై దాడులకు దిగుతున్నాయి. దీంతోపాటు వాహనాలపై వెళ్తున్నవారిని వెంబడించడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పెందుర్తి గ్రామీణం, పరవాడ, సబ్బవరం ప్రాంతాల్లో కూడా కుక్కల బెడద పెరిగిపోయింది. ముఖ్యంగా చికెన్ షాపులు, పౌల్ట్రీల వ్యర్థాలు తిని కుక్కలు మరింతగా రెచ్చిపోతున్నాయి. జనావాసాల్లో తిరుగుతూ ప్రజలపై దాడులకు దిగుతున్నాయి.

నియంత్రణ చర్యలు శూన్యం

నిబంధనల మేరకు జనావాసాల్లో తిరుగుతున్న వీధి కుక్కలను చంపే అవకాశం లేదు. అయితే వీటి బెడద ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కుక్కల్ని పట్టుకుని బయటకు తరలించే ప్రయత్నం చేయొచ్చు. మరోవైపు కుక్కలకు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్లతో పాటు, కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు కూడా చేయాలి.

అవన్నీ ప్రకటనలకు, ప్రతిపాదనలకే పరిమితమవుతున్నాయి. కనీసం నెలలో రెండు సార్లు ప్రత్యేక డ్రైవ్ ద్వారా కుక్కలను పట్టాల్సి ఉండగా అటువంటి చర్యలు ఎక్కడా కనిపిస్తున్న దాఖలాల్లేవు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



అపరిచితులు కనబడగానే వీధి కుక్కలు గట్టిగా మొరగడం, దంతాలు బయటపెట్టి భయంకరంగా చూడటం, చుట్టూ తిరగడం తదితర చేష్టలు చేస్తుంటాయి. మొదటి రెండు చర్యలు ప్రమాదానికి సంకేతాలు

కుక్కలు బిగ్గరగా మొరుగుతూ కరిచేందుకు సిద్ధంగా ఉన్నట్లు గుర్తించగానే వాటి వైపు, వాటి కళ్లలోకి చూడకూడదు. వాటిని పట్టించుకోనట్లుగా పక్కకు చూడాలి. దాంతో వాటికి ఎలాంటి హాని చేయరని భావిస్తాయి.

కుక్కలు వెంటపడితే పరిగెత్తితే ప్రయోజనం ఉండదు. అవి మరింతగా అరుస్తూ వెంటపడతాయి. పరిసరాలను గమనించి రక్షించుకునేందుకు వీలుగా ఉండే ఎత్తైన గేటు, గోడ ఉన్న ప్రాంతానికి చేరుకుంటే మంచిది.

కుక్క కాటు ఇక తప్పదని అనిపిస్తే ఆత్మరక్షణ కోసం అందుబాటులో ఉన్న ఏ వస్తువుతోనైనా అడ్డుకునేందుకు ప్రయత్నించాలి. వీలైతే దాని ముఖాన్ని కప్పేయండి. అది తప్పించుకునేలోగా మనం తప్పించుకోవచ్చు.

కుక్క కరిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- కుక్కకాటుపై అలసత్వం మంచిది కాదు. చిన్న పంటిగాటు పడినా చికిత్స తీసుకోవాలి. కుక్క కాటు కారణంగా మరణిస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంది.
- కుక్క కరిస్తే వెంటనే సబ్బుతో ఆ గాయాన్ని శుభ్రంగా కడగాలి. కొందరు గాయాలకు పసుపు పెట్టి ఊరుకుంటారు. అక్కడ మురికి, బ్యాక్టీరియా చేరి సమస్య మరింత ఎక్కువ అవుతుంది.
- ఆల్కహాల్ వంటివి పోసే వారి సంఖ్య ఎక్కువే. అలాంటి పనులు చేయకూడదు.
- కుక్క కాటు వల్ల రక్తస్రావం అధికంగా ఉంటే, దాని నియంత్రణకు శుభ్రమైన వస్త్రంతో కట్టుకట్టి, వెంటనే వైద్యుల వద్దకు వెళ్లాలి. టిటానిస్(టీటీ) ఇంజక్షన్ తీసుకోవడం చాలా ముఖ్యం.
- రేబిస్ వ్యాక్సిన్ ఐదుసార్లు(మొదటి రోజు, 3వ రోజు, 7వ రోజు, 14వ రోజు, 31వ రోజు) తీసుకోవాలి. ఇవి అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయి.

నాటు వైద్యం వద్దు



కుక్క కాటుకు గురైన సమయంలో చాలా మంది నాటు వైద్యంతో సరిపెడుతున్నారు. అది ప్రమాదకరం. కుక్క కరిచిన వెంటనే గాయాన్ని సబ్బుతో శుభ్రం చేయాలి. ఆస్పత్రికి తీసుకొస్తే తగు మోతాదులో వ్యాక్సిన్ వేస్తాం. ప్రస్తుతం కుక్కకాటు వ్యాక్సిన్ పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంది.

– డాక్టర్ అవంతి, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ

నియంత్రణకు చర్యలు



కాలనీల్లో కుక్కల సంచారంపై ఫిర్యాదులు వస్తున్నాయి. మా సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం. జనావాసాల్లో తిరుగుతున్న కుక్కలను పట్టుకుని తరలించే ప్రక్రియ చేపడతాం. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో కుక్కల నియంత్రణలో భాగంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయిస్తున్నాం.

– హైమావతి, జోనల్ కమిషనర్, జోన్–8

ఆక్రమణల తొలగింపు



సబ్బవరంలో అక్రమ నిర్మాణాన్ని పొక్లెయిన్ సాయంతో తొలగిస్తున్న ఆర్ఐ వీరయ్య

సబ్బవరం: ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ కట్టడాలపై రెవెన్యూ అధికారులు సోమవారం చర్యలు చేపట్టారు. మండలంలోని బాటజంగాలపాలెం సర్వే నెం.185లో 5.37 ఎకరాల ప్రభుత్వ వాగు పోరంబోకు భూమి ఆక్రమణకు పాల్పడి కొబ్బరి, యూకలిప్టస్, ఎర్రచందనం మొక్కలు వేసినట్లు వచ్చిన ఫిర్యాదుపై అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయేషా, సబ్బవరం తహసీల్దార్ చిన్నికృష్ణతో కలిసి పరిశీలించారు. ఆక్రమణలను తొలగించడంతో పాటు ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించారు. సబ్బవరం రెవెన్యూ పరిధి సర్వే నెం.260–4లో 0.04 సెంట్ల వాగు పోరంబోకు స్థలంలో నిర్మించిన అక్రమణ కట్టడాలను రెవెన్యూ అధికారులు తొలిగించారు. ఆర్డీవో, తహసీల్దార్ వెంట మండల సర్వేయర్ లాలం అప్పారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వీరయ్య, సచివాలయ సర్వేయర్ లోకేష్ తదితరులున్నారు.

ఎస్ఆర్ పురంలో దుర్గామల్లేశ్వర కల్యాణం రేపు



కల్యాణ రాట వేస్తున్న భక్తులు

పెందుర్తి: మండలంలోని సౌభాగ్యరాయపురం(ఎస్ ఆర్ పురం)లో కొలువుదీరిన కనకదుర్గమ్మ ఆలయ 12వ వార్షికోత్సవం బుధవారం నిర్వహించనున్నారు. ఉదయం నుంచి అమ్మవారికి పంచామృతాభిషేకం, ధూప దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం ఉదయం 8.30కి దుర్గామల్లేశ్వర కల్యాణం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు గ్రామంలో భారీ ఎత్తున సారె ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి సమర్పిస్తామన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి, కల్యాణ రాట వేశారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆందోళన



చినముషిడివాడలోని వార్డు సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

- పట్టణంలో రెండు, పల్లెల్లో మూడు సెంట్లు ఇస్తామన్న హామీ అమలుకు సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా

పెందుర్తి: పేదలకు ఇంటి స్థలాలు ఇస్తామని అధికారంలో వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ మాటను నిలబెట్టుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చెప్పినట్లు పట్టణ ప్రాంతంలో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇంటి స్థలాల పథకాన్ని తక్షణమే అమలు చేయాలన్నారు. ఈ మేరకు చినముషిడివాడలోని వార్డు సచివాలయాల సముదాయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమలులో వెనుకంజ వేయడం మంచిది కాదన్నారు. అమలు చేయకపోతే సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సచివాలయం అడ్మిన్‌కు వినతిపత్రం అందించారు. జిల్లా సమితి సభ్యుడు వై.రాంబాబు, పెందుర్తి ఏరియా కార్యదర్శి ఎస్.అసిరినాయుడు, పార్టీ సభ్యులు రాము, అరుణ, శ్రీరామ్, రమణ, విజయ, రజని తదితరులు పాల్గొన్నారు.

పరవాడ: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గ్రామీణ పేదలకు మూడు సెంట్లు పట్టణ పేదలకు రెండు సెంట్ల ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణ రాయితీని రూ.5 లక్షలకు పెంచాలని సీపీఐ జిల్లా సమితి సభ్యురాలు బూసి పరమేశ్వరి డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు దేశపాత్రునిపాలెం వార్డు సచివాలయం వద్ద సోమవారం అర్జీదారులతో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇళ్ల స్కీంలో ఇళ్ల స్థలం కోసం సెంటు స్థలాన్ని, అది కూడా దూర ప్రాంతంలో కేటాయించడం వలన సబ్సిడీ రుణం సరిపోక స్కీం వచ్చిన చాలా మంది ఇళ్లను నిర్మించుకోలేకపోతున్నారన్నారు. ఇసుకను రవాణా చార్జీలతో పాటు ఉచితంగా సరఫరా చేయాలనిడిమాండ్ చేశారు. అనంతరం ఇంటి స్థలాల కోసం దరఖాస్తులతో పాటు సమస్యలపై వినతిపత్రాన్ని సచివాలయ కార్యదర్శి త్రినాథ్‌కు అందించారు. కార్యక్రమంలో కె.లక్ష్మి, అనురాధ, తులసి, సరోజిని, నారాయణమ్మ పాల్గొన్నారు.



సచివాలయ అడ్మిన్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు



దేశపాత్రునిపాలెం సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ ప్రతినిధులు

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు



పోటీ పరీక్షలపై యువతకు అవగాహన కల్పిస్తున్న ఇంగ్లిష్ సబ్జెక్టు నిపుణుడు రాజేష్



సబ్బవరం గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

పెందుర్తి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఆకట్టుకుంది. సాహిత్యం, ప్రముఖుల జీవిత చరిత్రలు, చిన్నపిల్లలకు సంబంధించిన పుస్తకాలు, నవలలు, పోటీ పరీక్షల పుస్తకాలు ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ పుస్తక పఠనంపై అందరూ ఆసక్తి పెంచుకోవాలన్నారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ మాట్లాడుతూ మంగళవారం ఇందిరాగాంధీ జయంతి, ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు.

సింహాచలం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా అడవివరం గ్రంథాలయంలో సోమవారం పోటీ పరీక్షలకు యువత ఎలా ఎలా సన్నద్ధం కావాలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం ఆధ్వర్యంలో మహేంద్ర ఎడ్యుకేషనల్ అకాడమీ ఆంగ్ల సబ్జెక్ట్ బోధకుడు బి.బి.రాజేష్ పాల్గొని, ఏయే పాఠ్యాంశాలు పఠనలోకి తీసుకోవాలో వివరించారు. గ్రంథాలయాలు పోటీ పరీక్షలకు హాజరయ్యే యువతకు ఎంతగానో దోహదపడతాయన్నారు.

సబ్బవరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు బాలకార్మిక నిర్మూలన చట్టం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాణి, దివాకర్, కుమారితో పాటు గ్రంథాలయ అధికారి వి.శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఓం నమో శివ రుద్రాయ..

- ఘనంగా కార్తీకమాస మూడో సోమవారం పూజలు
- భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు



ఇరువాడ భీమలింగేశ్వరుని సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



పినగాడి చోడేశ్వరస్వామి..



ఉమా చంద్రమౌళేశ్వరస్వామి



భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



అన్నసమారాధన ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు

పెందుర్తి: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా మూడవ సోమవారం పూజలతో నియోజకవర్గంలోని శైవక్షేత్రాలు కళకళలాడాయి. మహాశివుడ్ని అభిషేకాలు, అర్చనలతో ఆరాధించారు.

- పెందుర్తి సాధూమఠం వద్ద ఉన్న పురాతన రామలింగేశ్వరస్వామి దేవాలయంలో రుద్రాభిషేకాలు జరిగాయి. అర్చనలు చేశారు.
- పినగాడి చోడేశ్వరస్వామి దేవాలయంలో విశేష అభిషేకాలు జరిగాయి. శివుడ్ని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది.
- సరిపల్లిలోని శివాలయంలో భక్తులు స్వహస్తాలతో శివునికి క్షీరాభిషేకాలు జరిపారు. మహానంది, ధ్వజస్తంభాలకు మహిళలు పూజలు చేశారు.
- కృష్ణరాయపురంశివాలయం, శ్రమశక్తినగర్ రామలింగస్వామి ఆలయం, ప్రశాంతినగర్, చింతలగ్రహారం శివాలయాలు, సుజాతనగర్ హరిహరక్షేత్రం, పెందుర్తి మహాకామేశ్వరి ఆలయంలోని జ్యోతిర్లింగాలకు పూజలు జరిగాయి.

సింహాచలం: సింహగిరిపైన, అడవివరంలోని శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి.

- త్రిపురాంతకస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న నాగేంద్రుడి వద్ద మహిళలు దీపారాధన చేశారు. శివలింగానికి స్వయంగా పూజలు నిర్వహించారు.
- కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న రావి, వేప, మర్రిచెట్టు వద్ద దీపారాధన చేశారు. గంగధార వద్ద భక్తులు స్నానాలు ఆచరించారు.
- కొండదిగువ పూలతోటలోని ప్రాచీన శివలింగం వద్ద భక్తులు పూజలు నిర్వహించారు.
- పాత అడవివరం, కాపుదిబ్బ, స్వామి కల్యాణమండపం వద్ద ఉన్న శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ఉదయం శివుడికి అభిషేకాలు జరిపారు. సాయంత్రం ఆకాశ దీపారాధనలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.
- సింహపురికాలనీలోని శివాలయంలో పెద్ద ఎత్తున భక్తులు శంకరుడికి అభిషేకాలు జరిపారు. ధ్వజస్తంభాల వద్ద, తులసికోట, ఉసిరిచెట్టు వద్ద విశేషంగా దీపారాధన చేశారు.
- విజినిగిరిపాలెం చంద్రాగార్డెన్స్ ఉమా చంద్రమౌళీశ్వర ఆలయంలో రుద్రాభిషేకంను అర్చకుడు ఉదయ్‌కృష్ణశర్మ ఘనంగా నిర్వహించారు.
- 93వ వార్డు పరిధి ప్రహ్లాదపురం శివాలయంలో భక్తులు అభిషేకాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున దీపారాధన చేశారు.

పరవాడ: పరవాడ గ్రామంలోని భ్రమరాంభిక మల్లికార్జునస్వామిని పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను ప్రారంభించారు. సర్పంచులు సిరపరపు అప్పలనాయుడు, జనసేన నాయకుడు పంచకర్ల ప్రసాద్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, పరవాడ మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, కూటమి నేతలు వియ్యపు చిన్న, కన్నూరి వెంకటరమణ, రెడ్డి శ్రీనివాసరావు, పైల రామచంద్రరావు, బుగిడి రామగోవిందరావు పాల్గొన్నారు.

సబ్బవరం: మండలంలోని ఇరువాడ స్వయంభూ భీమలింగేశ్వరస్వామిని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ కొటాన రాము, ఎంపీటీసీ కర్రి అప్పారావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. మొగలిపురం సిరపరపువారి కల్లాల్లోని గౌరీ పరమేశ్వరుల పుట్ట వద్ద పార్టీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ పూజలు నిర్వహించారు. .

- దేవీపురం దక్షవాటిలో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. పంచ భూత లింగేశ్వరుని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. యాగశాలలో ఏకాదశ రుద్ర హోమాలు జరిపారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



మనోజ్ ప్రీతం(ఫైల్)

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పురుషోత్తపురంలో ఉంటున్న మనోజ్ ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితులను ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో మనోజ్ తల్లి పోలీసులను ఆశ్రయించింది. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.